సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 30 । అక్టోబర్ । 2023



ఫేమస్ రుచులు

ఒక్కో ప్రాంతానికి ఒక్కో మధురమైన ప్రత్యే కత ఉంటుంది. పేరులోనే కాదు రుచిలో కూడా వీటికి సాటిలేదు. 8లో



సామాజిక సేవలో యువత

సాయి యువ స్వరం పేరుతో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర యువజన సదస్సు ఆదివారంతో ముగిసింది. 8లో



న్యాయ సంహిత బిల్లుపై చర్చ

భారతీయ న్యాయ సంహిత బిల్లుపై విస్తృతమైన చర్చ జరగాల్సి ఉందని డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ డి.సూర్యప్రకాశరావు అన్నారు. 8లో

న్యూస్‌రీల్

వచ్చే నెలలో అయ్యప్ప మహా సంగమం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

సీతంపేట: ఏయూ గ్రౌండ్స్‌లో నవంబరు 24, 25, 26 తేదీల్లో అయ్యప్ప మహా సంగమం నిర్వహించనున్నట్టు అయ్యప్ప సేవా ట్రస్టు, అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ ప్రతినిధులు తెలిపారు. శంకరమఠంలో ఆదివారం ట్రస్టు చైర్మన్ పైలా ఆదిమోహన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఈ మహా సంగమంలో ఉత్తరాంధ్రలోని వేల సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొనున్నారని పేర్కొన్నారు. 25న విలక్ ఉత్సవం, 26న పడి పూజతో పాటు విద్యా హోమం, సంతాన సాఫల్య హోమం, పార్వతి హోమం నిర్వహిస్తామన్నారు. కేరళ నుంచి శబరిమల ప్రధాన తంత్రి కంఠరరు రాజీవరు, తంత్రి కంఠరరు బ్రహ్మదత్తన్, 15 మంది మేల్ శాంతి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో పూర్వపుష్కల అయ్యప్ప సేవా ట్రస్ట్ చైర్మన్ ఎం.క్రిష్ణయ్య, అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, పూజా కోర్ కమిటీ ఉపాధ్యక్షుడు ధర్మాల శ్రీనివాసరెడ్డి, చైర్మన్ ఆదిమూలపు నాగరాజు, కార్యదర్శి గాడు తాతినాయుడు, వైస్ చైర్మన్ టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అప్పన్న ఆలయంలో గ్రహణ సంప్రోక్షణ పూజలు



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున గ్రహణ సంప్రోక్షణ పూజలను విశేషంగా నిర్వహించారు. చంద్రగ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం 5.15 గంటలకు ఆలయాన్ని మూసివేసిన విషయం తెలిసిందే. గ్రహణానంతరం ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటలకు తిరిగి ఆలయాన్ని తెరిచి స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం ఆలయ సంప్రోక్షణ, హోమాలు నిర్వహించారు. తరువాత ఆరాధన, బాలభోగం సేవలను నిర్వహించి ఉదయం 8 గంటల నుంచి భక్తులకు దర్శనాలు పునరుద్ధరించారు.

280 మంది ఉపాధ్యాయులు సర్దుబాటు

విశాఖ విద్య : ఉమ్మడి విశాఖ జిల్లాలో 280 మంది ఉపాధ్యాయులకు వేర్వేరు పాఠశాలల్లో సర్దుబాటు చేస్తూ డీఈవో ఎల్.చంద్రకళ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో గల పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులుగా గుర్తించిన వారిని, అవసరమైన చోట్ల వర్క్ అడ్జస్ట్‌మెంట్ కింద విధులు కేటాయించారు. వీరిలో స్కూల్ అసిస్టెంట్ బయాలజీ-18, ఇంగ్లిష్-20, హిందీ-7, గణితం-44, ఫిజికల్ సైన్స్-33, సోషల్ సైన్స్-21, తెలుగు-27 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అదేవిధంగా 110 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులను సైతం అర్హత మేరకు ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సర్దుబాటు చేశారు. ఉత్తర్వుల్లో పేర్కొన్న ఉపాధ్యాయులంతా కేటాయించిన పాఠశాలల్లో వెంటనే రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు.

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నేడు రాక

మహారాణిపేట: పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సోమవారం విశాఖ రానుందని కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. ఈ నెల 31న వ్యాపార, వాణిజ్య అంశాలపై వివిధ బ్యాంకుల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలతో కమిటీ సభ్యులు సమావేశం కానున్నారని పేర్కొన్నారు. కేవీఐసీ, యుబీఐ నోడల్ ఏజెన్సీలుగా వ్యవహరిస్తున్నాయని.. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సీహెచ్ గణపతికి కలెక్టర్ సూచించారు.

'నేవీ మాజీ సైనికులను భారత్‌కు తీసుకురండి'



బీచ్‌రోడ్డులో ర్యాలీ చేస్తున్న వాకర్స్

బీచ్‌రోడ్డు: ఖతార్‌లో మరణశిక్ష పడిన 8 మంది నేవీ మాజీ సైనికులను వెనక్కి రప్పించాలని కోరుతూ ఆదివారం ఆర్.కె.బీచ్‌లో ర్యాలీ జరిగింది. రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగింది. పెద్ద సంఖ్యలో వాకర్స్, యువతీ యువకులు పాల్గొని మాజీ సైనికులకు అండగా నిలిచారు. ఖతార్‌పై ఒత్తిడి తీసుకొచ్చి మాజీ సైనికులను భారత్‌కు తీసుకురావాలని నినదించారు.

ఉలిక్కిపడిన విశాఖ

- విజయనగరం జిల్లా చినరావుపల్లి సమీపంలో రైలు ప్రమాదం
- ఆగి ఉన్న రైలును వెనుక నుంచి ఢీకొట్టిన మరో రైలు
- ఎనిమిది మంది మృతి, 30 మందికి పైగా గాయాలు
- తమ వారి కోసం ఆరా తీసేందుకు రైల్వేస్టేషన్‌కు పరుగులు

సాక్షి, విశాఖపట్నం : బాలేశ్వర్ ఘటన జరిగి నాలుగు నెలలు గడిచినా.. ఆ మహా విషాదం ఇంకా కళ్లముందే కదులుతోంది. ఇంతలోనే మరో ఘోరం.. మాటలకందని విషాదం.. కళ్లు మూసి తెరిచేలోపు క్షణాల్లో ప్రమాదం జరిగిపోయింది. ఆదివారం రాత్రి విశాఖపట్నం నుంచి బయల్దేరిన పలాస రైలును, వెనుక నుంచి వెళ్లిన విశాఖ-రాయగడ రైలు విజయనగరం జిల్లా చినరావుపల్లి సమీపంలో ఢీకొంది. ఈ ఘటనలో ఎనిమిది మంది మృతి చెందగా 30 మందికిపైగా గాయపడ్డారు. విషాద ఘటన గురించి తెలుసుకున్న విశాఖవాసులు ఉలిక్కిపడ్డారు. తమ వారి యోగక్షేమాల కోసం ఆరా తీసేందుకు రైల్వే స్టేషన్‌కు పరుగులు తీశారు. వాల్తేరు రైల్వే డివిజన్ అధికారులు.. ఘటన జరిగిన వెంటనే ప్లాట్‌ఫామ్ నం.1లో ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. ప్రయాణికుల కోసం వచ్చిన వారి వద్ద నుంచి వివరాలు సేకరిస్తూ ఘటనా స్థలంలో ఉన్న రెస్క్యూ బృందానికి సమాచారం అందిస్తున్నారు. వారంతా ఎలా ఉన్నారో తెలుసుకొని తిరిగి అక్కడకు వచ్చినవారికి తెలియజేస్తున్నారు.

కేజీహెచ్‌లో ప్రత్యేక బృందాలు

ప్రమాద ఘటన తెలుసుకున్న కలెక్టర్ డా.మల్లికార్జున కేజీహెచ్ వైద్యులను అప్రమత్తం చేశారు. కేజీహెచ్ క్యాజువాలిటీలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి 0891-2558494 నంబర్‌ని అందుబాటులో ఉంచారు. అదేవిధంగా రైలు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు ఇద్దరు వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలంటూ ఆదేశించారు. వైద్యులను సంప్రదించేందుకు 8341483151, 9688321986 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 9030226621, 7036111169, 08912590102 నంబర్లలో సంప్రదించాలని కలెక్టర్ మల్లికార్జున తెలిపారు.
- విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో హెల్ప్ లైన్ నెంబర్ 0891-2746330 / 0891-2744619.



విశాఖ రైల్వేస్టేషన్‌లో నిలిచిపోయిన హౌరా కోరమాండల్ ఎక్స్‌ప్రెస్



రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ వద్ద ప్రయాణికులు

రైలు ప్రమాదం బాధాకరం

రైలు ప్రమాద ఘటనపై విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, రైల్వే డీఆర్ఎంకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా స్థానిక పార్టీ శ్రేణులతో మాట్లాడి సంఘటన ప్రాంతంలో సత్వర సహాయక చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు.

ఎక్కడికక్కడ నిలిచిపోయిన రైళ్లు

ఈ ఘటనతో విజయనగరం వైపు వెళ్లాల్సిన, విజయనగరం వైపు నుంచి రావలసిన పలు రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

పలు రైళ్లు రద్దు కాగా ఇంకొన్ని రైళ్లను దారి మళ్లించారు. మరికొన్ని రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం స్టేషన్లలో నిలిపివేశారు.

రైలు ప్రమాద బాధితురాలికి పెందుర్తిలో చికిత్స

పెందుర్తి: రైలు ప్రమాదంలో గాయపడిన రేజేటి వరలక్ష్మి అనే మహిళ పెందుర్తి ప్రభుత్వ సీహెచ్‌సీలో చికిత్స పొందుతుంది. పార్వతీపురానికి చెందిన వరలక్ష్మి పెందుర్తిలోని కుమార్తె ఇంటికి కొద్దిరోజుల క్రితం వచ్చింది. ఆదివారం సాయంత్రం తిరిగి పార్వతీపురం వెళ్లేందుకు పెందుర్తి రైల్వే స్టేషన్‌లో రాయగడ రైలు ఎక్కింది. ఆ రైలు అలమండ వద్ద ప్రమాదానికి గురైన ఘటనలో వరలక్ష్మి కాలికి తీవ్ర గాయమైంది. ప్రమాదంపై సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనాస్థలికి చేరుకుని వరలక్ష్మిని పెందుర్తి సీహెచ్‌సికి తరలించారు.



చికిత్స పొందుతున్న వరలక్ష్మి

విద్యతోనే ప్రగతి సాధ్యం

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఏయూక్యాంపస్: విద్య.. వ్యక్తి ప్రగతికి దోహదం చేస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. యాదవ ఎంప్లాయిస్ శ్రీ కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏయూలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అసెంబ్లీ మందిరంలో యాదవ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా క్రీడలు, విద్య రంగాల్లో ప్రతిభ చూపిన చిన్నారులకు మంత్రి చేతులమీదుగా ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఆర్థికంగా వెనుకబడి, ప్రతిభ కలిగిన యాదవ సామాజిక వర్గ విద్యార్థులకు వైఈఎస్ ట్రస్ట్ సేవలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యువత విద్యావంతులు కావాలని, తద్వారా ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవడం సాధ్యపడుతుందన్నారు. మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ సి.హెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయ నిర్మల, వైఎస్సార్ వైద్య విశ్వవిద్యాలయం మాజీ వీసీ డాక్టర్ శ్యామ్ ప్రసాద్, టీటీడీ సభ్యుడు ఎస్.నాగసత్యం, భరణికాణ రామారావు, డాక్టర్ గుంటు బోయిన రవికుమార్, పల్ల మహేష్, పిన్నింటి అప్పలరాజు, నక్క దుర్గ బాబు, ఎన్.నరసింగరావు, ఎన్.వెంకట రమణ, పలువురు కార్పొరేటర్లు ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారుల శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. మంత్రిని ట్రస్ట్ నిర్వాహకులు సత్కరించి జ్ఞాపికను బహూకరించారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

రాష్ట్ర గవర్నర్‌కు వీడ్కోలు



విశాఖ విమానాశ్రయంలో గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు వీడ్కోలు పలుకుతున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆదివారం విజయవాడకు పయనమయ్యారు. విశాఖ విమానాశ్రయంలో అధికారులు ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈనెల 27న విశాఖ వచ్చిన ఆయన ఆంధ్ర వైద్య కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, ప్రత్యేక ఉప కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో డి.హుస్సైన్ సాహెబ్, పోలీసులు, ఎయిర్‌పోర్ట్ అధికారులు తదితరులు వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

లక్ష్యం దిశగా పయనం

ఆర్టీసీ ఫుల్ జోష్

- అక్టోబర్ ఆదాయం రూ.28 కోట్లు
- దసరాకు అదనంగా వచ్చింది రూ.కోటి
- ఈ పండగకు 400కు పైగా స్పెషల్స్ నడిపిన ఆర్టీసీ
- పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో



సాక్షి, విశాఖపట్నం: యాజమాన్యం నిర్దేశించిన లక్ష్యానికి ఆర్టీసీ చేరువవుతోంది. గత కొన్నాళ్లుగా విశాఖ జిల్లాలో ఆర్టీసీ ఆదాయం మెరుగవుతోంది. దాదాపు రోజుకు రూ.కోటి చొప్పున రాబడిని తెచ్చుకుంటోంది. సెప్టెంబర్‌లో రూ.27.40 కోట్లను ఆర్జించింది. అక్టోబర్‌లో దసరా పండగను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ యాజమాన్యం విశాఖ జిల్లాకు రూ.30 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇందుకనుగుణంగానే ఆర్జిస్తోంది. ఈ నెల 28 వరకు రూ.26.55 కోట్ల రాబడి సమకూరింది. నెలాఖరుకు మరో రూ.3 కోట్ల ఆదాయం రావచ్చని ఆర్టీసీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ దసరా సందర్భంగా విశాఖ జిల్లాలోని వివిధ డిపోల నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు దాదాపు 400 ప్రత్యేక సర్వీసులను నడిపింది. వీటిలో హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి ప్రాంతాల నుంచి, ఉత్తరాంధ్ర జిల్లాల వైపు ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంది. ఈ నెలలో దసరా ముందు వరకు 97 స్పెషల్ బస్సులు 53,860 కి.మీల మేర తిరిగి రూ.23,24,441 రాబడిని తెచ్చాయి. 67 శాతం ఆక్యుపెన్సీ రేషియో (ఓఆర్)తో కిలోమీటరుకు రూ.43.16 చొప్పున లభించింది. గతేడాది దసరా ముందుకంటే ఈసారి ఎక్కువ సర్వీసులను తిప్పారు. గత సంవత్సరం దసరాకు ముందు అదే సమయానికి 83 స్పెషల్ బస్సులు 40,792 కిలోమీటర్లు తిరిగి రూ.19,31,754 మాత్రమే రాబడిని తీసుకు రాగలిగాయి. ఇక దసరా తర్వాత కూడా తిరుగు ప్రయాణమయ్యే వారి సంఖ్య కూడా బాగానే ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని విశాఖ నుంచి హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు మరో వంద (సుమారు 200 సర్వీసులు) స్పెషల్ బస్సులను నడిపారు. కాగా ఒకట్రెండు రోజుల్లో దసరా స్పెషల్ సర్వీసులు నిలిచిపోనున్నాయి. ప్రస్తుతం విశాఖ జిల్లా ఆర్టీసీకి 64 శాతం ఓఆర్ ఉంది. ఇది కార్పొరేషన్ సగటుకంటే 0.5 శాతం అధికం. గత సెప్టెంబర్ ఓఆర్ కంటే ఇది రెండు శాతం ఎక్కువని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.

ఆట.. పాట.. కేరింత

ముగిసిన ఏఎంసీ శతాబ్ది వేడుకలు

బీచ్‌రోడ్డు: ఆంధ్రా వైద్య కళాశాల శతాబ్ది వేడుకలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ వేడుకల్లో సినీ సంగీత దర్శకురాలు ఎం.ఎం శ్రీలేఖ, గాయకులు గీతా మాధురి, అరుణ్ కౌండిన్య, ధనుంజయ్ తదితరులు తమ గాత్రంతో హోరెత్తించారు. తెలుగు, హిందీ పాటలను పాడి వైద్య విద్యార్థులను ఉత్సాహ పరిచారు. కొమరం భీముడో, యూ ఆర్ మై ఎమ్మెల్యే, ఓ సీత, బంగారు కోడిపెట్ట తదితర పాటలు ఆలపించి.. అలరించారు. గాయకులు పాడిన పాటలకు వైద్య విద్యార్థులు తమదైన శైలిలో డ్యాన్సులు చేసి ఎంజాయ్ చేశారు.

ఎంపీ సత్యవతికి సన్మానం

అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతిని సినీ గీత రచయిత సుద్దాల అశోక్‌తేజ, సంగీత దర్శకురాలు ఎం.ఎం.శ్రీలేఖ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వందేళ్లు పూర్తి చేసుకున్న ఏఎంసీలో తాను కూడా చదువుకోవడం చాలా గర్వంగా ఉందన్నారు. తన వంతుగా ఏఎంసీ వుమెన్స్ హాస్టల్ కోసం ఎంపీ నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రజలు దైవంగా భావించే వైద్య వృత్తికి మరింత వన్నె తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.



ఎంపీ సత్యవతిని సన్మానిస్తున్న సినీ గీత రచయిత అశోక్ తేజ, ఎంఎం శ్రీలేఖ తదితరులు



ఉత్సాహంగా వాక్‌థాన్

శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వాక్‌థాన్ జరిగింది. ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వైద్యులు డ్యాన్స్‌లు చూస్తూ కేరింతలు కొట్టారు.



వాక్‌థాన్‌లో డ్యాన్సులు చేస్తున్న ఏఎంసీ విద్యార్థులు





పాటలు పాడుతున్న గాయకులు అరుణ్, శ్రీలేఖ



ఆరోగ్య దిక్సూచి 'యోగా'

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా విలేజ్ వేదికగా నిర్వహించిన ఉత్తరాంధ్ర జిల్లాల యోగా పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. ఆదాయ పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ శంకర్ పాండి ఆదివారం జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత వీసీ డాక్టర్ పి.శ్యామ్‌ప్రసాద్, జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు యోగా రాజు, కార్యదర్శి సీహెచ్ వెంకట రమేష్, ఏయూ యోగా విభాగం సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు భానుకుమార్ తదితరులు ప్రసంగించారు. అనంతరం వివిధ విభాగాల వారీగా మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పోటీ పడి యోగాసనాలు వేశారు. సాయంత్రం నిర్వహించిన ముగింపు వేడుకల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



యోగాసనాలు వేస్తున్న మహిళలు



విజేతలతో నిర్వాహకులు

తేనెలొలుకు తెలుగు

వేడుకగా తెలుగు సాహిత్య వైభవ్



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు

బీచ్‌రోడ్డు: తెలుగు భాష చాలా పురాతనమైందని, రెండో శతాబ్దం నుంచి తెలుగు ప్రస్తావన ఉందని పలువురు వక్తలు అన్నారు. ఆంధ్రా మెడికల్ కళాశాల శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలులో ఆదివారం 'తెలుగు సాహిత్య వైభవ్'కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు తెలుగు సాహిత్యం గురించి మాట్లాడుతూ రామాయణం, మహాభారతంలో వైద్యం కోసం పొందుపర్చిన అంశాలను వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఎంసీ పూర్వ విద్యార్థి, రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరరావు మాట్లాడుతూ తెలుగు కథ ప్రపంచ నలుమూలలకు చేరిందన్నారు. ఏఎంసీ శతాబ్ది ఉత్సవాల్లో తెలుగు సాహిత్యం కోసం కృషి చేస్తున్న వారిని గౌరవించడం ఆనందంగా ఉందన్నారు. ఏఎంసీతో తనకు తొమ్మిదేళ్ల అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. ప్రముఖ సాహిత్య రచయిత ప్రొఫెసర్ బేతాళ రాంబ్రహ్మం మాట్లాడుతూ నేటి సాహిత్యం చూస్తుంటే ఏదో తెలియని బాధ కలుగుతోందన్నారు. సాంకేతికతను వినియోగించుకుని నేటి తరానికి అర్థమయ్యే విధంగా సాహిత్యాన్ని రూపొందించాలన్నారు. వైద్యం కోసం సాహిత్య రూపంలో గ్రంథాలను అందించడం చాలా అభినందనీయమన్నారు. ప్రముఖ సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ సినిమా పాటల్లో సాహిత్యం లేదని పలు వేదికల్లో సాహిత్యవేత్తలు వ్యాఖ్యానించడం బాధాకరమన్నారు. చాలా పాటల్లో సాహిత్యం దాగి ఉంటుందని చెప్పారు. వచనం, ఛమత్కారం, సంగీతం, నాట్యం, చిత్ర లేఖనం, యుద్ధ నైపుణ్యత, నటన అన్ని కలిస్తే సినిమా అని, అలాంటి సినిమాల్లో పాట రాయడం గొప్ప అవకాశంగా భావిస్తామన్నారు. సాహిత్యంతో కూడిన పలు పాటలను ఆయన ప్రస్తావించారు. అనంతరం ప్రముఖ డాక్టర్, రచయిత ఈదర పెదవీర్రాజు రచించిన పద్యాల్లో వంద ఉత్తమ పద్యాలతో రూపొందించిన 'శత కవితా ఝరి'పుస్తకాన్ని ఈ సందర్భంగా అతిథులు ఆవిష్కరించారు. కళారత్న మీగడ రామలింగేశ్వరరావు, సభా అధ్యక్షుడు డాక్టర్ రఘురామారావు తదితరులు పాల్గొన్నారు.

ఫేమస్ రుచులు మన వైజాగ్‌లో..

మాడుగుల హల్వా.. భీమవరం పచ్చళ్లు.. రాజమండ్రి రోజ్‌మిల్క్.. సుబ్బయ్య గారి బుట్ట భోజనం.. కాకినాడ కాజా.. ఆత్రేయపురం పూతరేకులు.. మధురై ఫేమస్ జిగర్తండ.. ఇలా ఒక్కో ప్రాంతానికి ఒక్కో మధురమైన ప్రత్యేకత ఉంటుంది. పేరులోనే కాదు రుచిలో కూడా వీటికి సాటిలేదు. ఎన్నో ఏళ్ల కిందట పుట్టిన ఈ రుచులు ఓ బ్రాండ్ ఇమేజ్‌ను సంపాదించుకున్నాయి. కస్టమర్ల విశ్వాసాన్ని చూరగొన్నాయి. ఆ ఇమేజ్‌తో ఆయా సంస్థలు వ్యాపారం విస్తరించడం సులువైపోయింది. విశ్వనగరి విశాఖలో ఇతర ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన ఈ వంటకాలను అందుబాటులోకి తీసుకొస్తూ.. కస్టమర్లతో శాశ్వత అనుబంధాన్ని కొనసాగిస్తున్నాయి. ఎప్పుడూ కొత్తదనాన్ని ఆహ్వానించే విశాఖ వాసులు, పర్యాటకులు ఈ రుచులను తనివితీరా ఆస్వాదిస్తున్నారు. – విశాఖపట్నం డెస్క్



- నగర వాసులను ఆహ్వానిస్తున్న నాన్ లోకల్ ఫుడ్ పాయింట్లు
- డిఫరెంట్ వంటకాలు.. కమ్మని పానీయాలు

సుబ్బయ్య గారి బుట్ట భోజనం

మీరెప్పుడైనా కాకినాడలోని సుబ్బయ్య గారి హోటల్‌లో బుట్ట భోజనం తిన్నారా.? ఇది వరకే తింటే ఓకే.. లేకుంటే మాత్రం కాకినాడ వెళ్లాల్సిన పని లేకుండా నగరంలోని ద్వారకానగర్‌లో సుబ్బయ్య గారి హోటల్ ఉంది. ఇక్కడ లభించే బుట్టభోజనం, ఫుల్ మీల్స్ బాగా ఫేమస్. కాకినాడ సుబ్బయ్య గారి హోటల్‌కు చాలా చరిత్రే ఉంది. 1947లో కాకినాడ నడిబొడ్డులోని రామారావు పేటలో కాఫీ హోటల్‌తో జీవితం ప్రారంభించారు నెల్లూరు జిల్లా చాకలికొండకు చెందిన సుబ్బయ్య. కాకినాడలో విద్యా సంస్థలు ఎక్కువగా ఉండటం, చాలా మంది దూర ప్రాంతాల నుంచి వచ్చి రూమ్ అద్దెకు తీసుకొని చదువుకునేవారు. వారికి భోజన సదుపాయం కల్పించే క్రమంలో సుబ్బయ్య హోటల్ ప్రారంభమైంది. ఇన్నేళ్లుగా ఫుడ్ రంగంలో ఓ వెలుగు వెలుగుతోంది. తండ్రి అడుగు జాడల్లో నడుస్తూ అతని వారసులు ఈ రుచులను నేటి తరానికి అందిస్తున్నారు. సుబ్బయ్య మనవళ్లు శ్రీనివాస్, బాలాజీ, గుప్తా విశాఖలో 2019 డిసెంబర్ 9న హోటల్‌ను ప్రారంభించారు. ఇక్కడ ప్రతి రోజూ సుమారు 50 బుట్ట భోజనం పార్సిల్స్ విక్రయిస్తుంటారు.

ఇంటి భోజనాన్ని మరిపిస్తాం



నగరవాసులకు కమ్మనైన విందు భోజనం అందించేందుకు సుబ్బయ్య గారి హోటల్‌ను ఆయన మనవళ్లు ప్రారంభించారు. ఇక్కడి ఫుడ్ ఇంటి భోజనం తిన్నంత తృప్తిగా ఉంటుందని కస్టమర్లు చెబుతుంటారు. మా హోటల్ బుట్ట భోజనానికి ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ఆహార పదార్థాల విషయంలో 100 శాతం నాణ్యత పాటిస్తాం.

–పి.రోహిణి, స్టాఫ్, సుబ్బయ్య గారి హోటల్



మధురై ఫేమస్ జిగర్తండ

తమిళనాడులో మధురై ఫేమస్ కూలింగ్ డ్రింక్ **జిగర్తండ**. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందించే **ఈ సంప్రదాయ** హెల్త్ డ్రింక్ రుచి చాలా బాగుంటుంది. **ఈ పా**నీయాన్ని మధురైకి పరిచయం చేసింది ఓ **ముస్లిం** పెద్ద. మరి మన నగరానికి విజయనగరం **జిల్లా బొబ్బి**లికి చెందిన జి.చిరంజీవి ఈ డ్రింక్‌ను పరి**చయం చేశా**రు. అతను బెంగళూరులోని ఓ పాఠశా**లలో టీచర్**గా పనిచేస్తున్నారు. అక్కడ లభించే జిగర్తం**డ రుచికి ఫిదా** అయిన ఆయన 2021 ఆగస్టు 18న **ఎన్‌ఏడీ ఫ్లైఓవ**ర్ సమీపంలో మధురై ఫేమస్ జిగర్తండ **పేరిట అవుట్** లెట్ ప్రారంభించారు. త్వరలో నగరం**లో మరో అవుట్** లెట్ ప్రారంభిస్తానని వెల్లడించారు.

మళ్లీ మళ్లీ వస్తారు



జిగర్తండ వ్యాపారం బాగా నడుస్తోంది. కస్టమర్ల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కొందరు మళ్లీ మళ్లీ వచ్చి తాగుతున్నారు. వేసవిలో ఫుల్ డిమాండ్ ఉంటుంది. మా వద్ద పార్సిల్, కేటరింగ్ సదుపాయం కూడా ఉంది. జిగర్తండతో పాటు బాసంతి, రోజ్ మిల్క్, మిల్క్ షేక్స్, ఫ్లేవర్ ఐస్ క్రీమ్స్ వంటి ఉత్పత్తులను కూడా విక్రయిస్తున్నాం.

– జి.ప్రదీప్‌కుమార్, నిర్వాహకుడు, మధురై ఫేమస్ జిగర్తండ

నోరూరించే భీమవరం పచ్చళ్లు



వెజ్ అండ్ నాన్ వెజ్ పచ్చళ్లకు పెట్టింది పేరు భీమవరం. వాటిని ఇష్టంగా తినాలనుకునే వారు అక్కడికి వెళ్లనవసరం లేదు. భీమవరం పచ్చళ్ల నిర్వాహకులు నగరంలో అవుట్ లెట్లు ఏర్పాటు చేసి అన్ని రకాల పచ్చళ్లను విక్రయిస్తున్నారు. ఎంవీపీ డబుల్‌రోడ్డులో ఏడేళ్ల కిందట భీమవరం పచ్చళ్లు పేరిట కె.సాంబశివరావు వ్యాపారం చేశారు. మూడేళ్ల కిందట ద్వారకానగర్ శంకరమఠం ఎదురుగా మరో అవుట్ లెట్‌ను ప్రారంభించారు. సంప్రదాయ రీతిలో ఇంటి వద్ద తయారు చేసి 70 రకాల వెజ్, 18 రకాల నాన్ వెజ్ పచ్చళ్లు విక్రయిస్తున్నారు. అమెరికా సహా 25 దేశాలకు ఎగుమతి చేస్తున్నారు.

ఐడియా అమ్మది.. నిర్వహణ నాన్నది

మాది భీమవరం. వైజాగ్‌కు షిఫ్ట్ అయ్యాం. విశాఖలో పచ్చళ్ల బిజినెస్ పెడితే బాగుంటుందని అమ్మ లలితాదేవి ఆలోచన చేశారు. ఆమె ఓ ప్రొఫెషనల్ చెఫ్. నాన్న సాంబశివరావు వెంటనే భీమవరం పచ్చళ్ల వ్యాపారం ప్రారంభించారు. అది క్లిక్ అయింది. ఇప్పుడు వ్యాపారం బాగా జరుగుతోంది. 25 దేశాలకు మా పచ్చళ్లను పంపిస్తున్నాం. – కె.సూర్య, భీమవరం పచ్చళ్లు

రాజమండ్రి రోజ్‌మిల్క్



రాజమండ్రి రోజ్‌మిల్క్ తాగాలంటే రాజమండ్రికి వెళ్లాల్సిన అవసరం లేదు. మన నగరంలో అందుబాటులో ఉంది. ఈ మిల్క్ తాగితే అమృతమే అంటున్నారు నగరవాసులు. రాజమహేంద్రవరానికి చెందిన సబ్బిన కోటేశ్వరరావుది వ్యవసాయ కుటుంబం. రోజ్‌మిల్క్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను తెలుసుకుని రాజమండ్రిలో వ్యాపారం ప్రారంభించి విజయవంతమయ్యారు. అనంతరం రాజమండ్రి నుంచి కాకినాడకు షిఫ్ట్ అయ్యి అక్కడ అవుట్ లెట్లు ప్రారంభించారు. 2020 మార్చిలో మొదటి రోజ్ మిల్క్ ఔట్ లెట్‌ను సీఎంఆర్ సెంట్రల్‌లో ప్రారంభించారు. అది సక్సెస్ కావడంతో 2022లో పాతజైల్ రోడ్ ఫుడ్ కోర్టులో ఒకటి, 2023లో ఎంవీపీ కాలనీ వెంకోజీపాలెం రోడ్డులో మరొక షాపు ప్రారంభించి విజయవంతంగా కొనసాగిస్తున్నారు. రోజ్‌మిల్క్‌కు ఉన్న డిమాండ్‌తో మరికొందరు వ్యాపారులు నగరంలో రద్దీ ఉన్న ప్రాంతాల్లో షాపులు తెరిచి విక్రయిస్తున్నారు.

తాపేశ్వరం మడత కాజా



తూర్పుగోదావరి జిల్లా తాపేశ్వరం కాజాకు చాలా పేరుంది. మైదా పిండితో మడతలు పెట్టి కాజాను తయారు చేసి, పంచదార పాకం పట్టి విక్రయిస్తారు. వాటి రుచి కారణంగా అతి తక్కువకాలంలోనే ప్రాచుర్యంలోకి వచ్చింది. తాపేశ్వరం కాజాగా ఖ్యాతి సంపాదించింది. సత్తిరాజు, రామస్వామి అనే వ్యాపారులు మొదటగా తాపేశ్వరం కాజాను పరిచయం చేశారని చెబుతారు. మొదట వీరు శుభకార్యాలకు పిండి వంటలు తయారు చేసి అందించేవారు. వంటలు వండేటప్పుడు రకరకాల ప్రయోగాలు చేసేవారు. వీరి దగ్గర ఎంతో మంది ఈ స్వీటు తయారు గురించి తెలుసుకుని.. జీవనోపాధి పొందుతున్నారు. తాపేశ్వరం లడ్డూలు కూడా ఫేమస్. తాపేశ్వరం పేరుతో నగరంలో పలు చోట్ల స్వీట్లు విక్రయిస్తున్నారు.

మాడుగుల హల్వా

అనకాపల్లి జిల్లా మాడుగులకు చెందిన మిఠాయి వ్యాపారి దంగేటి ధర్మారావుకు 1890 ప్రాంతంలో కొత్త రకమైన మిఠాయి తయారుచేయాలన్న ఆలోచన వచ్చింది. అంతే బూడిద గుమ్మడి, కొబ్బరి కాయరసంతో హల్వా తయారు చేశారు. ఆ రుచి నచ్చడంతో హల్వా చాలా ఫేమస్ అయిపోయింది. నగరంలో మాడుగల హల్వాను విరివిరిగా విక్రయిస్తున్నారు. మాడుగుల హల్వా యవ్వన శక్తి పెంచడంతోపాటు శరీర స్థితిని నిలకడగా ఉంచుతుందని స్థానికుల నమ్మకం.



ఆత్రేయపురం పూతరేకులు

పూతరేకులు అత్యంత ప్రసిద్ధి చెందిన మిఠాయి. ఒక్కో చోట పూతరేకులు రుచి ఒక్కో విధంగా ఉంటుంది. ఆత్రేయపురం పూతరేకుల రుచి మాత్రం అమోఘం. తీపి పదార్థాలను వేసి పొరలు పొరలుగా మడిచి పెట్టి పూత రేకులను తయారుచేస్తారు. నెయ్యి, బెల్లం, పంచదార పొడి, జీడిపప్పు, బాదం పప్పుతో పూతరేకులు తయారు చేస్తుంటారు.



ఇవేనా.. కాకినాడ కాజా, భీమాళి మామిడి తాండ్ర, హైదరాబాద్ బిర్యానీ, కోనసీమ రాజు గారి కోడి పులావ్, గోదావరి, విజయవాడ రుచులు.. ఇలా ఆయా ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందిన ఎన్నో వంటకాలను మనకు అందిస్తూ.. తద్వారా ఎందరో జీవనోపాధి పొందుతున్నారు.

సత్తాచాటిన ఆంధ్రా స్కేటర్లు

విశాఖ స్పోర్ట్స్ : 19వ ఆసియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రా స్కేటర్లు సత్తా చాటారు. హరికమల్, దీపిక-కైవల్య జోడి, కైవల్య, గ్రీష్మ ఆయా కేటగిరీల్లో స్వర్ణాలందుకున్నారు. క్యాడెట్ ఇన్‌లైన్ బాలురలో కైవల్య స్వర్ణాన్ని, కార్తికేయ కాంస్యాన్ని అందుకున్నారు. యూత్ ఇన్‌లైన్ బాలికల్లో గ్రీష్మ స్వర్ణాన్ని, ఆశ్రిత రజతాన్ని సాధించారు. జూనియర్ ఇన్‌లైన్ బాలురలో వైష్ణవ్ కాంస్యాన్ని అందుకోగా.. జూనియర్ బాలికల సోలో డాన్స్‌లో సాయిసంహిత రజత పతకాన్ని సాధించింది. క్యాడెట్ పెయిర్ స్కేటింగ్‌లో దీపిక-కైవల్య జోడి స్వర్ణాన్ని అందుకోగా సీనియర్ క్వాడ్‌లో హరికమల్ స్వర్ణాన్ని సాధించాడు. ఈనెల 18న చైనాలో ప్రారంభమైన ఈ పోటీల్లో భాగంగా ఆర్టిస్టిక్, ఇన్‌లైన్ హాకీ పోటీలు 28వ తేదీతో ముగిశాయి. ఈ చాంపియన్‌షిప్‌లో 50 స్వర్ణాలతో చైనీస్ తైపీ తొలి స్థానంలో నిలవగా చైనా 28 స్వర్ణాలు సాధించగా భారత్ ఎనిమిది స్వర్ణాలు సాధించగలిగింది. వాటిల్లో ఆంధ్రా స్కేటర్లు నాలుగు స్వర్ణాలందుకున్నారు. ఏడు రజతాలు, ఆరు కాంస్య పతకాలను సాధించారు.

ముగిసిన స్కేటింగ్ పోటీలు



స్కేటర్‌ను సత్కరిస్తున్న జాయింట్ కమిషనర్ రవీంద్ర

విశాఖ స్పోర్ట్స్: జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైన స్కేటర్లను వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర సత్కరించారు. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న సాహితికి అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలపై జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతి

విశాఖ విద్య: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కోరుతూ ఎస్టీయూ విశాఖ జిల్లా కమిటీ ప్రతినిధులు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లి సుభద్రకు వినతిపత్రం అందజేశారు. క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘ రాష్ట్ర నాయకులు ఇమంది పైడిరాజు, కృష్ణ కుమార్ ఈ మేరకు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. జెడ్పీ పరిధిలోని ఉపాధ్యాయులకు పీఎఫ్ బకాయిలు చెల్లింపులో నెలకొన్న జాప్యంపై దృష్టి సారించాలని కోరారు. బోధనేతర సిబ్బంది రేషనలైజేషన్ సత్వరమే చేపట్టడం ద్వారా విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. కొన్ని చోట్ల పాఠశాలలకు చెందిన స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని, ఇలాంటి చర్యలపై సత్వరమే స్పందించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆమె.. త్వరలోనే సమస్యలన్నింటికీ పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినట్లు ఇమంది పైడిరాజు తెలిపారు.

సామాజిక సేవలో యువత పాత్ర కీలకం

- ముగిసిన సాయి యువ స్వరం
- ప్రత్యేక ఆకర్షణగా సినీ నటుడు సాయికుమార్



మొక్కలు నాటుతున్న సాయి సేవకులు



మాట్లాడుతున్న నటుడు సాయికుమార్

పెదగంట్యాడ: అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు అంటూ భగవాన్ సత్యసాయి బాబా దివ్య సందేశం ప్రతి ఒక్కరి హృదయంలో నిలిచిపోయిందని ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ అన్నారు. మెడ్‌టెక్ జోన్‌లోని ఆంపియర్ హాలులో శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో సాయి యువ స్వరం పేరుతో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర యువజన సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా సాయికుమార్ తన స్వరంతో యువతను ఉర్రూతలూగించారు. సాయిబాబా సందేశాన్ని వినిపిస్తూ ఆకట్టుకున్నారు. అనంతరం ఆయన బాబాతో తన కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేశారు. సాయిబాబా తనకు ఇష్టమైన దైవమని, బాబా అనుగ్రహంతో తనతో పాటు తన కుటుంబం ఎంతో ఎదిగిందన్నారు. సత్యసాయి సేవలో యువత తరించడం అభినందనీయమన్నారు. సత్యసాయి సేవా సంస్థల జాతీయ సమన్వయకర్త డాక్టర్ గోపి పిడతల మాట్లాడుతూ దేశానికి సేవ చేయడానికి యువత ఏమాత్రం సంకోచించవద్దన్నారు. భరతమాత సేవలో తరించాలని కోరారు. పాశ్చాత్య పోకడలకు పోకుండా, మన సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు చాటిచెప్పేలా కార్యక్రమాలు రూపుదిద్దాలని సూచించారు. సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు మాట్లాడుతూ యువత క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో యువత పాత్ర కీలకమన్నారు. అనంతరం వివిధ జిల్లాల్లో యువత చేపట్టిన సేవా కార్యక్రమాలతో ఏపీ ప్రదర్శించారు. అతిథులను ఘనంగా సత్కరించారు. సత్యసాయి భజనలతో ప్రాంగణంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. అనంతరం 2కే రన్, యూనిటీ రన్ చేశారు. మెడ్‌టెక్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 1600 యువతీ యువకులు వేడుకలకు హాజరయ్యారు. కార్యక్రమంలో వి.కల్యాణ్, స్నేహలత సాయి, జాతీయ సేవా కో–ఆర్డినేటర్లు, రాష్ట్ర కో–ఆర్డినేటర్లు, సత్యసాయి సేవా సంస్థల జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదానం



గ్రంథావిష్కరణ చేస్తున్న మల్లాడి కృష్ణారావు

సీతంపేట: కవి సంధ్య సాంస్కృతిక సంస్థ(యానాం) ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం –2023, శిఖామణి సమగ్ర సాహిత్యం, పరిశోధన 7వ సంపుటి, గద్దర్ స్మారక సంచికల ఆవిష్కరణ జరిగింది. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీమంత్రి మల్లాడి కృష్ణారావు గ్రంథావిష్కరణ చేశారు. ప్రయోగాత్మక రచనలతో తెలుగు నాటక రంగాన్ని సుసంపన్నం చేస్తున్న డాక్టర్ దీర్ఘాసి విజయ్ భాస్కర్‌కు శిఖామణి జీవన సాఫల్య పురస్కారం 2023ను కవి సంధ్య అధ్యక్షుడు డాక్టర్ శిఖామణి చేతుల మీదుగా ప్రదానం చేశారు. ప్రముఖ యువ కవి సుంకర గోపాల్‌కు శిఖామణి యువ పురస్కారం 2023 అందజేశారు. మరో 16 మంది సాహితీవేత్తలకు కవి సంధ్య ప్రతిభా పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో సినీ గీత రచయిత సుద్దాల అశోక్‌తేజ, సాహిత్యవేత్తలు ఆచార్య చందు సుబ్బారావు, గంటాడ గౌరునాయుడు, దాట్ల దేవదానం రాజు, ప్రయాగ సుబ్రహ్మణ్యం, అట్టాడ అప్పలనాయుడు, మధునా పంతుల సత్యనారాయణమూర్తి, సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు.

న్యాయ సంహిత బిల్లుపై విస్తృత చర్చ జరగాలి

డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ సూర్యప్రకాశరావు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో భారతీయ న్యాయ సంహిత బిల్లు–2023పై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ వర్క్‌షాపు ఆదివారంతో ముగిసింది. వర్సిటీ, విశాఖపట్నంలోని సెంటర్ ఫర్ క్రిమినల్ జస్టిస్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య డాక్టర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడారు. భారత ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భారతీయ న్యాయ సంహిత బిల్లుపై విస్తృతమైన చర్చ జరగాల్సి ఉందన్నారు. చట్టంలో ప్రతిపాదించిన అనేక అంశాలను సవివరంగా చర్చించేందుకు వర్క్‌షాపు ఉపయుక్తంగా నిలిచిందన్నారు. దేశ ద్రోహం, టెర్రరిస్ట్ యాక్ట్, వ్యవస్థీకృత నేరాలు, క్రిమినల్ చట్టం, బీఎన్ఎస్ బిల్లులో చేసిన మార్పులపై రిసోర్స్ పర్సన్లు వివరించారు. మొదటి రోజు భువనేశ్వర్‌కు చెందిన కిట్ స్కూల్ ఆఫ్ లాకు చెందిన ఆచార్యులు భవానీ ప్రసాద్ పండా, రెండో రోజు ఢిల్లీ ఎన్ఎల్‌యూ ఉపకులపతి ఆచార్య డాక్టర్ జి.ఎస్.భాజపాయ్ ముఖ్య అతిథులుగా పాల్గొని కీలకోపన్యాసం చేశారు. రిసోర్స్ పర్సన్లుగా విశాఖ జిల్లా కోర్టు రిటైర్డ్ జడ్జి జి.వెంకట కృష్ణయ్య, నల్సార్ వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వి.కె సంతి, సీఎస్ఐ కాలేజ్ ఆఫ్ లీగల్ స్టడీస్ ప్రిన్సిపాల్ ఆచార్య జార్జ్ జోసెఫ్, నగరానికి చెందిన సీనియర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.ఆదినారాయణ వ్యవహరించారు. వర్సిటీ రిజిస్ట్రార్ జోగినాయుడు, సెంటర్ ఫర్ క్రిమినల్ జస్టిస్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఎ.అరుణ శ్రీలక్ష్మి, ఫ్యాకల్టీ కో కన్వీనర్ డాక్టర్ పి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వర్క్‌షాపులో పాల్గొన్న డీఎస్ఎన్ఎల్‌యూ ఉప కులపతి ఆచార్య డాక్టర్ సూర్యప్రకాశరావు, ముఖ్య అతిథులు, విద్యార్థులు

సాక్షి ఫొటోగ్రాఫర్‌కు మరో ప్రతిష్టాత్మక అవార్డు



అవార్డు సొంతం చేసుకున్న ఫొటో



ఎండీ నవాజ్

సాక్షి, విశాఖపట్నం : మరో ప్రతిష్టాత్మక అవార్డు సాక్షి పత్రిక విశాఖపట్నం ఫొటోగ్రాఫర్ ఎండీ నవాజ్‌కు వరించింది. ఏపీ స్టేట్ క్రియేటివ్ అండ్ కల్చర్ కమిషన్ ఆధ్వర్యంలో ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్(ఐఐపీసీ), ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా(పీఏఐ) సంయుక్తంగా ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో ఎండీ నవాజ్ తీసిన చిత్రానికి ఎంఏ రహీమ్ మెమోరియల్ అవార్డు వరించింది. డెడ్లీ డ్యూటీస్ ఆఫ్ పోలీస్ క్యాప్షన్‌తో తీసిన ఫొటో అవార్డు సొంతం చేసుకుంది. నవంబర్ 1న విజయవాడలో జరిగే వరల్డ్ ఫొటో జర్నలిజం డే ఉత్సవాల్లో అవార్డులు ప్రదానం చేస్తారు. ఈ అవార్డు వచ్చేందుకు సహకరించిన యాజమాన్యానికి, సహచరులకు నవాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్‌పై ఉక్కుపాదం

- నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్
- లాడ్జీ, హోటళ్లలో విస్తృత తనిఖీలు

అల్లిపురం: నగరంలో క్రికెట్ బెట్టింగ్‌కు తావులేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని అన్ని హోటళ్లు, లాడ్జీల్లో పోలీసులు ఆదివారం విస్తృతంగా తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. వన్డే క్రికెట్ ప్రపంచకప్ నేపథ్యంలో బెట్టింగ్‌కు పాల్పడే వారి కదలికలపై నిరంతర నిఘా పెట్టామన్నారు. క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడినా, నిర్వహించినా, పాల్పడే వారికి సహకరించినా, బెట్టింగ్ నిర్వహించడానికి స్థలాన్ని సమకూర్చినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే డయల్–100/112కు గానీ, 94933 36633కు వాట్సాప్ చేయాలన్నారు. పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 0891–2565454 లేదా దగ్గరలోని స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. 2023లో ఆరు బెట్టింగ్ కేసుల్లో 29 మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.5,18,06,242 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహించిన కొందరు వ్యక్తుల నుంచి సైబర్ క్రైం పోలీసులు ఇప్పటివరకు రూ.5 కోట్లు ఫ్రీజ్ చేశారని వెల్లడించారు.